నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్‌ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాఘవేంద్ర కాలనీ ఏ,బి బ్లాక్‌లు, గోల్డెన్‌ తులీప్‌ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

పటాన్‌చెరు టౌన్‌: అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన సందీప్‌కుమార్‌ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ 2 లక్షల 50 వేల రూపాయల ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి సందీప్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్‌ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నరసింహగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

పటాన్‌చెరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో శనివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్‌ ఫాస్ట్‌ జరుగుతుందని ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. అనంతరం మైత్రి మైదానాన్ని పరిశీలించారు. పటాన్‌చెరు కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌, మండల విద్యాధికారి నాగేశ్వర్‌ నాయక్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, పటాన్‌చెరు సీఐ వినాయక్‌ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

లయన్స్‌ క్లబ్‌ చేయూత



ఉమాదేవికి నగదును అందజేస్తున్న కొండ విజయ్‌కుమార్‌

చందానగర్‌: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హోప్‌ చేయూతనందించింది. చందానగర్‌ హుడా కాలనీలోని హోప్‌ కార్యాలయంలో శనివారం అల్మాస్‌గూడకు చెందిన ఉమాదేవి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఫౌండర్‌ కొండ విజయ్‌కుమార్‌, కోఆర్డినేటర్‌ రమణలు కలిసి బాధితురాలికి రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ హోప్‌ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ట్రెజరర్‌ రెడ్డి ప్రవీణ్‌ రెడ్డి, ఉపాధ్యక్షులు బర్కా మల్లేష్‌ యాదవ్‌, సింగిదారి రాజశేఖర్‌, మారం ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓయోలో 3.6 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్ట్‌



గంజాయితో పట్టుబడ్డ నిందితులతో ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు

గచ్చిబౌలి: ఓయో హోటల్‌ కేంద్రంగా గంజాయి విక్రయాలు చేస్తున్న ఇద్దరిని రాష్ట్ర ఎక్సైజ్‌ టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. గచ్చిబౌలి పీఎస్‌ పరిధిలోని కొండాపూర్‌లోని ఓయో హోటల్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం రాత్రి ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడులు చేశారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన రాజు(25), మధ్యప్రదేశ్‌కు చెందిన సంజన్‌(18)లను అరెస్ట్‌ చేశారు. నిందితుల నుంచి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 3.62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

చెత్తకుప్పలు.. దుర్వాసన

మియాపూర్‌: చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్‌ కాలనీలో దుర్గ ఎస్టేట్స్‌ పార్కు ముందు చెత్త పేరుకుపోయింది. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో గుట్టలుగా పేరుకుపోయింది. పార్కుకు వచ్చే ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఈ ఏడాదయినా..!

ఆగిన పనులు మొదలయ్యేనా..



ఇప్పటికీ అందుబాటులోకి రాని అర్బన్‌ స్ట్రీట్‌ ఫర్నీచర్‌

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా అభివృద్ధి జరుగుతున్నా ఇంకా పలు ప్రాంతాల్లో పనులు ఆగిపోయాయి. పూర్తయినవి ఇంకా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఇక కొన్ని ప్రకటనలకే పరిమితమయ్యాయి. నిధుల లేమి, చెల్లింపుల్లో జాప్యం, అధికారుల బదిలీలు వంటి కారణాలు ఆయా పనులపై ప్రభావం చూపుతున్నాయి. ఉన్నతాధికారులు పెండింగ్‌ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఫ్లైఓవర్లు, లింకురోడ్లు, కూడళ్ల అభివృద్ధితో ఈ ఏరియా ఆకర్షణీయంగా మారింది. కానీ కొన్ని ప్రాంతాల్లో పనులు శంకుస్థాపనలకే పరిమితం కాగా మరికొన్ని ప్రారంభదశలోనే ఆగిపోయాయి. ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త ఏడాదిలో.. కొంగొత్త ఆశలు

నిలిచిన పనులు..

- ఆరేళ్ల క్రితం రూ.50 కోట్లతో ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి వరుణ్‌ మోటార్స్‌ ఐటీకారిడార్‌ రోడ్డు ,మరోవైపు వైట్‌ టాపింగ్‌ రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు.
- నాలుగేళ్ల క్రితం రూ.45 కోట్లతో చేపట్టిన దాబా కూడలి నుంచి మధురానగర్‌, ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ ఓఆర్‌ఆర్‌ అండర్‌ బ్రిడ్జి వరకు పలుచోట్ల ఆరులేన్ల రోడ్డు వేశారు. కానీ ఎనిమిది లేన్లు, డక్ట్‌, ఇరువైపులా డ్రైనేజీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం మరిచిపోయారు. అలాగే ఈ రోడ్డు కోసం శ్మశానవాటిక స్థలాన్ని తీసుకుని ప్రహరీగోడ నిర్మించలేదు.
- రాయదుర్గం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం నిర్మించాల్సి ఉంది. అలాగే మధురానగర్‌, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి బస్తీ దవాఖానాలకు సొంత భవనాలు అవసరం.
- ఇక పలు చెరువుల సుందరీకరణకు శంకుస్థాపనలు చేశారు. అలాగే కొన్నిచోట్ల వాకింగ్‌ట్రాక్‌లు నిర్మించినా అవి నేడు ఆనవాలు లేకుండా పోయాయి.
- ఖాజాగూడలో రూ.4 కోట్లతో చేపట్టిన ఇండోర్‌ స్టేడియం, రూ.50 లక్షలతో టీఎన్‌జీఓ కాలనీలో మోడల్‌ మార్కెట్‌ భవనం, గోపన్‌పల్లితండాలోని మల్టీ పర్పస్‌ ఫంక్షన్‌ హాలు, ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్‌ వరకు ఏర్పాటు చేసిన అర్బన్‌ స్ట్రీట్‌ ఫర్నీచర్‌ తదితరాలను అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలకు మేలు చేకూరడం ఖాయం. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



8 లేన్ల రోడ్డు ఆరు లేన్లకే పరిమితం కాగా.. మెట్రో రైలు నిర్మాణం చేసేది కూడా ఇక్కడే..



వైట్‌టాపింగ్‌ రోడ్డు సగం వరకు వేసి.. మరోవైపు వేయని దృశ్యం

ప్రారంభం కాని పనులివే..

- మధురానగర్‌ దాబా కూడలిలోని గుట్ట వద్ద భారీ టన్నెల్‌ నిర్మాణం, ట్రిపుల్‌ఐటీ కూడలిలో పాదచారుల స్కైవాక్‌ నిర్మాణం ప్రకటనలకే పరిమితమైంది.
- గౌలిదొడ్డిలో నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ డిజైన్‌ (నిడ్‌)కు శంకుస్థాపన చేసి దాన్ని విజయవాడకు తరలించగా తిరిగి ఏర్పాటు ప్రహరీగోడలకే పరిమితమైంది.
- నానక్‌రాంగూడ రూ.20 లక్షలతో, రాయదుర్గంలో రూ.65 లక్షలతో ప్రతిపాదనలు, ఖాజాగూడలో రూ.3 కోట్లతో శ్మశానవాటికలకు శంకుస్థాపనలు చేసినా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు.
- సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన దాబా కూడలి, ట్రిపుల్‌ఐటీ కూడలి, విప్రో సర్కిల్‌లో ఫ్లైఓవర్లు ఈ ఏడాదిలోనైనా పనులు చేపట్టి పూర్తి చేస్తారని అందరూ ఆశిస్తున్నారు.
- గోపన్‌పల్లి మీదుగా వట్టినాగులపల్లి వరకున్న రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాలేదు.

'ఇన్నోవేటివ్‌ హ్యాండ్స్‌' చిత్రప్రదర్శన

ఆర్ట్‌గ్యాలరీలో 21 వరకు కొనసాగింపు



చిత్రాలను తిలకిస్తున్న అంజుపొద్దార్‌



మాదాపూర్‌: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌గ్యాలరీలో ఇన్నోవేటివ్‌ హ్యాండ్స్‌ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను శనివారం చిత్రకళాకారిణి అంజుపొద్దార్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. 50 చిత్రాలు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు.ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

బస్తీదర్శన్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌ పరిధిలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్‌ బి.పుష్ప అన్నారు. డివిజన్‌ పరిధిలోని మల్లికార్జుననగర్‌ కాలనీలో శనివారం అధికారులతో కలసి బస్తీదర్శన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



మాదాపూర్‌: కళాకారులు నృత్య ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం కనకదుర్గ నృత్య విభావరి డైరెక్టర్‌ నిర్మలా ప్రభాకర్‌ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. శ్లోకం, వినాయక స్తోత్రం, లింగాష్టకం, అన్నమాచార్య కీర్తన, అలరులు కురియగా, జతిస్వరం తదితర అంశాలను కళాకారులు సంహిత, సహస్ర, పూర్వి, రితిక, దిత్య, ఆద్య, అనిష్క, నికిత, నక్షత్ర, ఆరోహి, కృతిక తదితరులు ప్రదర్శించారు. నాట్య గురువులు ఓలేటి రంగమణి, నిర్మలా విశ్వేశ్వర్‌రావు, జి.వెంకట్‌రెడ్డి, డాక్టర్‌ కుసుమ భోగరాజు, కుసుమ కమలరత్నం తదితరులు పాల్గొని అభినందించారు.



అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం నిత్యశ్రీ డ్యాన్స్‌ అకాడమీ నృత్యగురువు రజిత శేఖర్‌ శిష్యబృందం కూచిపూడి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సీతారాముల కల్యాణం, మహాగణపతిం , రాముడు రాఘవుడు, సీతా స్వయంవరం తదితర కీర్తనలకు నృత్యరూపమిచ్చారు. కళాకారులు మేధస్విని, అరుషి, శాన్వి, రోహిణి, రీతు, శాన్వి, అభినేత్రి, శ్రీవల్లి, సహస్య, హన్విత, ఆద్య తదితరులు పాల్గొన్నారు.



నివాళి

మియాపూర్‌: మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని జేపీ ఎన్‌నగర్‌లో శనివారం ఎన్టీఆర్‌ వర్ధంతిని నిర్వహించారు. అభిమానులు, పార్టీ నాయకులు ఎన్టీఆర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ డివిజన్‌ ప్రధాన కార్యదర్శి యలమంచి ఉదయ్‌కిరణ్‌, వేంకటేశ్వర్లు, వినోద్‌, నాని, ప్రసాద్‌ పాల్గొన్నారు.

రైతులను నష్టపోనివ్వం : ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి



అధికారులతో ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌ రేడియల్‌ రోడ్డులో భూమి కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌ వార్డు కార్యాలయంలో రైతులు, హెచ్‌ఎండీఏ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వారి సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. తాము అడిగిన పరిహారం ఇస్తే రేడియల్‌ రోడ్డుకు భూమి ఇస్తామని రైతులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఈ ప్రాంతంలో రోడ్లు వేస్తే మరింత డిమాండ్‌ పెరుగుతుందన్నారు. ఉస్మాన్‌ నగర్‌ నుంచి వట్టినాగులపల్లి వరకు రేడియల్‌ రోడ్డు ఎంతో అవసర మన్నారు. ఉస్మాన్‌ నగర్‌ పరిధిలోని రైతులు భూములను ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. రైతులను కాపాడుకునే బాధ్యత తమపై ఉందన్నారు.

వేమన పద్యాలను నేర్చుకోవాలి



హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌ ప్రిన్సిపల్‌ మురళి

రాయదుర్గం: వేమన పద్యాలను పాఠశాల స్థాయిలోనే నేర్చుకోవాలని హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌ ప్రిన్సిపల్‌ మురళి విద్యార్థులకు సూచించారు. వేమన జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు నైతిక విలువలు, సమాజం, కుటుంబ బాధ్యతలను నెరవేర్చడంపై చక్కటి పద్యాలను వేమన రాశారన్నారు. అనంతరం విద్యార్థులకు పద్యాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. అధ్యాపకుడు డాక్టర్‌ లంక పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అశోక్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని బొల్లారం, తెల్లాపూర్‌, అమీన్‌పూర్‌ మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 21, 22, 23 తేదీలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, కమిషనర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులో మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగియనున్న నేపథ్యంలో పూర్తిచేసిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, నూతన పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వీటితోపాటు జలమండలి ద్వారా చేపట్టిన నూతన రిజర్వాయర్లను ప్రారంభించడంతోపాటు ఇంటింటికి రక్షిత మంచినీటి సరఫరా ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో అమీన్‌పూర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌ చైర్మన్‌ నరసింహగౌడ్‌, తెల్లాపూర్‌ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ రాములుగౌడ్‌, మున్సిపల్‌ కమిషనర్లు, జలమండలి జీఎం సుబ్బారాయుడు, అధికారులు పాల్గొన్నారు.

బార్‌ లైసెన్సుల పేరిట ఘరానా మోసం

గచ్చిబౌలి: ప్రభుత్వంలోని పెద్దలు, ఎక్సైజ్‌ అధికారులు తనకు తెలుసని, బార్‌ అండ్‌ రెస్టారెంట్లకు ఎక్సైజ్‌ లైసెన్స్‌లు ఇప్పిస్తానని నమ్మించిన ఓ యువకుడు ఘరానా మోసానికి పాల్పడ్డాడు. ఇద్దరు బాధితుల వద్ద కోటి రూపాయలు వసూలు చేసి చేతులెత్తేశాడు. బాధితుల ఫిర్యాదుతో రాయదుర్గం పోలీస్‌ స్టేషన్‌లో చీటింగ్‌ కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్‌ జిల్లా కొడంగల్‌కు చెందిన జి.వెంకటపవన్‌ బీఫార్మసీ పూర్తి చేసి అయ్యప్ప సొసైటీలో నివాసం ఉంటున్నాడు. తనకు ప్రభుత్వంలోని పెద్దలతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఎక్సైజ్‌ అధికారులు బాగా తెలుసని బార్‌ అండ్‌ రెస్టారెంట్లకు ఎక్సైజ్‌ లైసెన్స్‌ ఇప్పిస్తానని నమ్మించాడు. రాయదుర్గం పీఎస్‌ పరిధిలోని బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ ఏర్పాటు చేసేందుకు లైసెన్స్‌ కావాలని కోకాపేట్‌కు చెందిన నాగార్జున, కొంపల్లికి చెందిన ధర్మారెడ్డిలు వెంకటపవన్‌ను సంప్రదించారు. గత ఆగస్టు నుంచి పలు దఫాలుగా నాగార్జున రూ.60 లక్షలు, ధర్మారెడ్డి రూ.20 లక్షలు ఇచ్చారు. ఎక్సైజ్‌ అధికారుల మంటూ పలుసార్లు ఫోన్‌లు చేసి మీ దరఖాస్తు ప్రాసెస్‌లో ఉందని చెప్పేవారు. దీంతో ఎక్సైజ్‌ లైసెన్స్‌ వస్తుందని నమ్మారు. నెలలు గడుస్తున్నా లైసెన్స్‌పై దాటవేత ధోరణితో వ్యవహరించడంతో విసుగెత్తిన బాధితులు నాంపల్లి ఎక్సైజ్‌ కార్యాలయంలో ఆరా తీశారు. మీకు ఫోన్‌ చేసిన వారు మా కార్యాలయంలో లేరని సమాధానం రావడంతో మోసపోయామని తెలుసుకున్నారు. శనివారం ఇద్దరు బాధితులు రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

నేడు మల్లన్న కల్యాణం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న మల్లిఖార్జునస్వామి, కేతకి భ్రమరాంబ అమ్మవార్ల కల్యాణం ఆదివారం ఉదయం 11.05 గంటలకు నిర్వహిస్తున్నట్టు దేవాలయ నిర్వహణ కర్త, కాంగ్రెస్‌ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌ యాదవ్‌ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు గోపూజ, పుణ్యాహవచనము, గణపతి పూజ, 9గంటలకు గణపతి హవనం, 11.05 గంటలకు కల్యాణం, సాయంత్రం 7గంటలకు అగ్నిగుండాలు తొక్కటం, రాత్రి 8 గంటలకు సొడమ్మ బోనాలు, రాత్రి 9 గంటలకు మల్లన్న ఒగ్గుకథ ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు నాగవల్లి, మంగళవారం ఉ.11.30 గంటలకు ఎల్లమ్మ కల్యాణం, బోనాలు ఉంటాయన్నారు.



మియాపూర్‌లోని ఓంకార్‌నగర్‌ కాలనీకి నల్లా కనెక్షన్లు మంజూరు చేయాలని కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు శనివారం స్థానిక కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. నల్లాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. – సాక్షి, సిటీబ్యూరో

కంటిమీద కునుకు కరువు

- దోమల విజృంభణ.. జ్వరాలు
- పరికి చెరువు.. గుర్రపుడెక్కమయం, దుర్వాసన



పరికి చెరువులో అలుముకున్న గుర్రపుడెక్క

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్‌ ఆల్విన్‌ కాలనీ డివిజన్‌ పరిధిలోని పరికి చెరువులో గుర్రపుడెక్క అల్లుకుపోయింది. దీనికితోడు మురుగునీరు చేరడంతో దుర్వాసనతో పాటు దోమలు, విష పురుగులకు నెలవుగా మారింది. పరికి చెరువు పరిసర ప్రాంతవాసులు రాత్రిపూట దోమలతో నిద్ర ఉండడం లేదని వాపోతున్నారు. చెరువు చుట్టూ సుమారు 40 కాలనీలు, 20 బస్తీలు ఉన్నాయి. సాయంత్రం 6 అయితే చాలు దోమల దండయాత్ర మొదలవుతోందని, నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. విష పురుగులు, సర్పాల సంచారం ఉందని చెప్పారు.



గుర్రపుడెక్క తొలగింపునకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ప్రయోజనం లేదని, కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా గుర్రపు డెక్కను తొలగించారని స్థానికులు విమర్శిస్తున్నారు. తీసిన గుర్రపు డెక్కను అక్కడే పడవేయటంతో తిరిగి చెరువు మొత్తం అల్లుకుంటోందని తెలిపారు. గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పరికి చెరువును సందర్శించి అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చారని తదనంతరం పట్టించుకోలేదని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువును అభివృద్ధి చేయాలి

పరికి చెరువులో గుర్రపుడెక్క తొలగించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రజల సొమ్ము దుర్వినియోగం అవుతుంది. చెరువులో పేరుకు పోయిన గుర్రపుడెక్కతో దోమలు, ఈగలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పరిసర ప్రాంతవాసులు రోగాల బారిన పడుతున్నారు. చెరువుల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం పరికి చెరువును అభివృద్ధి చేయాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, తులసీనగర్‌ అధ్యక్షుడు